కాలనీపై కూటమి నిర్లక్ష్యం

- అభివృద్ధికి నోచుకోని రహదారులు
- వెలగని వీధి దీపాలు
- ఇళ్లల్లోకి వస్తున్న విష పురుగులు, సర్పాలు
- అసౌకర్యాల నడుమ జగనన్న కాలనీ వాసులు

నూజివీడు: పేద ప్రజలకు సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల అభివృద్ధిని ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. అంతర్గత రహదారుల అభివృద్ధి, వీధిలైట్ల ఏర్పాటు, మంచినీటి వసతి వంటి మౌలిక సదుపాయాలను కల్పించకుండా గాలికొదిలేయడంతో జగనన్న కాలనీ వాసులు పడరాని పాట్లు పడుతున్నారు. నూజివీడు మండలం అన్నవరం నుంచి పోతురెడ్డిపల్లి రోడ్డులోని జగనన్న కాలనీ వాసులు సమస్యలతో నిత్యం సహవాసం చేస్తున్నారు. పాలకులు, అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో స్థానికులు తమ సమస్యలను ఎవరు తీరుస్తారా అని ఎదురు చూస్తున్నారు.


జగనన్న కాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్డు

250 మంది పేదలకు

ఇక్కడ సుమారు 250 మంది పట్టణంలోని పేదలకు గత ప్రభుత్వం నివేశన స్థలాలను ఇచ్చి గృహాలను మంజూరు చేసింది. ఈ గృహాలను నిర్మించుకున్న వారు సుమారు 70 నుంచి 100 కుటుంబాలు కాలనీలో నివాసముంటున్నారు. మరికొన్ని గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. గత మూడేళ్లుగా ఈ కాలనీలో నివాసముంటున్నా కనీస సదుపాయాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లైట్లు మీరు కొనుక్కోండి.. మేం వేస్తాం

కాలనీలో కనీస సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీధి లైట్లు వెలగకపోవడంతో రాత్రిపూట పాముల బెడదతో బిక్కుబిక్కు మంటూ కటిక చీకటిలో జీవనం సాగిస్తున్నారు. మున్సిపల్ సిబ్బందిని లైట్లు వేయమని అడిగితే లైట్లు కొనుక్కొచ్చుకుంటే వేస్తామంటున్నారని, లైట్లు తెచ్చి ఇచ్చే స్థోమత ఉంటే ఇక్కడ ఎందుకు ఉంటామని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలం కావడంతో రహదారులు బురదమయంగా తయారయ్యాయి. తాగునీటి సదుపాయం లేదని, బోరు మో టర్ చెడిపోతే పది రోజుల వరకు బాగు చేయించడం లేదని, దీంతో తాగడానికి, గృహావసరాలకు నీళ్లు లేక తీవ్ర అవస్థలు పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ సమీపంలోనే మద్యం షాపును ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని మహిళలు వాపోతున్నారు.

ఇళ్లల్లోకి పాములు వస్తున్నాయి



తోటల మధ్యలో ఉండటం వల్ల రాత్రి పూట ఇళ్లల్లోకి పాములు వస్తున్నాయి. వీధి లైట్లు లేకపోవడంతో చీకట్లో బయట కాలు పెట్టాలంటే భయమేస్తోంది. ఊర్లు వెళ్లిన వారు చీకటి పడిన తరువాత కాలనీకి రావాలంటే పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. వర్షాకాలం కావడంతో రోడ్లన్నీ బురదమయంగా ఉన్నాయి. రోడ్లను అభివృద్ధి చేయాలి.

– జన్ను కనకదుర్గ, జగనన్న కాలనీ, అన్నవరం

తాగునీరు ఇవ్వాలి



కాలనీలో మంచినీళ్లు లేవు. రోడ్లు సరిగా లేవు. ఏడాదిగా ఒక్క రోడ్డు కూడా అభివృద్ధి చేయలేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్లను కనీసం గ్రావెల్ పోసి రాకపోకలు సాగించేందుకు అనువుగానైనా అభివృద్ధి చేయాలి. మందుబాబులు కాలనీలోకి వచ్చి తాగుతున్నారు.

– మన్యం లలిత, జగనన్న కాలనీ, అన్నవరం

గురుకుల వసతి గృహాల్లో కనీస వసతులు కరువు

వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రవిచంద్ర


భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న రవిచంద్ర, ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ

జి.కొండూరు: కనీస మౌలిక వసతులు లేక గురుకుల వసతి గృహాల్లో విద్యార్థులు నరకయాతన పడుతున్నారని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర అన్నారు. జి.కొండూరు మండల పరిధి కుంటముక్కల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల వసతి గృహాన్ని స్థానిక ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మతో కలిసి ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో సమస్యలపై విద్యార్థినులతో నేరుగా మాట్లాడి తెలుసుకున్నారు. రవిచంద్ర మాట్లాడుతూ కుంటముక్కల గురుకుల వసతి గృహంలో సమస్యల్ని అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలలో పారిశుద్ధ్య లోపంతో ఈగలు, దోమల ఉధృతి ఎక్కువై విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజనం, వంటకి వినియోగించే సరుకులు, కూరగాయలు నాసిరకంగా ఉన్నాయన్నారు. ఐఐటీ, నీట్ మెడికల్ అకాడమీ విద్యార్థులకు బోటనీ, కెమిస్ట్రీ అధ్యాపకుల్ని ప్రభుత్వం ఇప్పటి వరకూ నియమించకపోవడం దారుణమన్నారు.

అధ్యాపకులే లేకుండా కార్పొరేట్ కళాశాలలతో ప్రభుత్వ ఐఐటీ అకాడమీ విద్యార్థులు ఎలా పోటీ పడతారని ప్రశ్నించారు. బాలికలు ఉండే పాఠశాల చుట్టూ ప్రహరీనే సక్రమంగా లేకపోతే భద్రత ఎలా ఉంటుందన్నారు. కుంటముక్కల సర్పంచ్ వంగూరి కుమారి, ఎంపీటీసీ సభ్యురాలు యరమల విజయశ్రీ, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు వై.నందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, మండల అధ్యక్షుడు జె.నాగ తేజసాయి, నాయకులు ఐ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి అనూష


న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి ఓ.అనూష


తిరువూరు వాహినీ కళాశాలలో మాట్లాడుతున్న జడ్జి సూర్యతేజ

నూజివీడు: మానవ అక్రమ రవాణాను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని నూజివీడు ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఓ.అనూష పేర్కొన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని సిద్ధార్థ బీ ఫార్మసీ కళాశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందుతున్నా మానవ అక్రమ రవాణా పెరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఎక్కడైనా మానవ అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే మీ సమీపంలోని పోలీసులకు తెలియజేయాలన్నారు. చట్టాలపై విద్యార్థి దశ నుంచి అవగాహన కలిగి ఉండాలన్నారు. నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నం రమేష్, మాజీ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్, కళాశాల డైరెక్టర్ గొల్లపూడి రవిబాబు, న్యాయవాది ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు సమాచారం ఇవ్వండి

తిరువూరు: శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశం అభివృద్ధి చెందుతుంటే మానవ అక్రమ రవాణా కూడా పెరుగుతుండటం శోచనీయమని తిరువూరు అదనపు జూనియర్ సివిల్ జడ్జి సూర్య తేజ అన్నారు. తిరువూరు వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పిస్తూ మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. చిన్న పిల్లలు, మహిళలు, యువతులను అక్రమరవాణా చేస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల వెంకటరెడ్డి, వాహినీ కళాశాల ప్రిన్సిపాల్ నాగేంద్ర బాబు, ఉచిత న్యాయ సహాయ న్యాయవాది ఎం.నాగేంద్రప్రసాద్, ఏజీపీ రాము, ఎస్ఐ సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు సంకురాత్రి జనార్దన రావు, రేగళ్ల మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సామిత్వ సర్వే నిర్వహించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఓ అనురాధ

నూజివీడు: సామిత్వ సర్వేను ప్రతి గ్రామ పంచాయతీలో తప్పనిసరిగా నిర్వహించాలని, సర్వే సిబ్బందికి పంచాయతీ సిబ్బంది సంపూర్ణ సహకారం అందించాలని డీపీఓ అనురాధ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామిత్వ సర్వేపై పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతులను రెండు రోజుల పాటు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులను బుధవారం సందర్శించిన డీపీఓ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో భౌగోళిక డేటా సేకరణ, మ్యాపింగ్ వంటివి రూపొందించాల్సి ఉంటుందన్నారు. పంచాయతీల్లో పారిశుద్ధ్యం మెరుగవ్వాలని, దీనికి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులదే పూర్తి బాధ్యతన్నారు. స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన పెంపొందింప చేసేందుకు అవగాహన ర్యాలీలను నిర్వహించాలన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులను నిర్వహించాలన్నారు. శిక్షణలో భాగంగా క్వాంటమ్ భౌగోళిక సమాచార వ్యవస్థ, ఫీల్డ్ డేటా సేకరణలపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ సుందరి, ఎంపీడీఓలు చెన్నా రాఘవేంద్రనాథ్, భార్గవి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం అలవాటు చేసుకోవాలి

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): ప్రకృతి వ్యవసాయాన్ని రైతులు అలవాటుగా మార్చు కోవాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి శంకర్ నాయక్ తెలిపారు. మండలంలోని కేతనకొండ గ్రామంలో జిల్లాలో విజయవాడ సబ్ డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రాల గ్రామ వ్యవసాయ సహాయకులకు ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజులుగా నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. శిక్షణ సదస్సులో ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కరమైన ఆహార పంటలు సమాజానికి అందుబాటులోకి తీసుకురావడమే ప్రకృతి వ్యవసాయం ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రకృతి సాగులో 9 సార్వత్రిక సూత్రాలు వివరించారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ ఫార్మింగ్, మేనేజ్‌మెంట్ ఫార్మింగ్ పథకం గురించి తెలియజేశారు. డ్రమ్ సీడర్ ద్వారా విత్తనాలు నాటడం ప్రయోగాత్మకంగా ప్రదర్శించి జీవామృతం తయారు చేయించారు. జిల్లా వ్యవసాయ అధికారి విజయకుమారి, విజయవాడ డివిజన్ ఏడీ వెంకటేశ్వరరావు, వివిధ మండలాల ఏవోలు పాల్గొన్నారు.

బుడమేరు వంతెనపై నిలిచిన ట్రాఫిక్


వంతెనపై వీరంగం చేస్తున్న వాహన చోదకులు

జి.కొండూరు: మండల పరిధి హెచ్.ముత్యాలంపాడు గ్రామం వద్ద బుడమేరు వంతెనపై ఇద్దరు వాహన చోదకులు బుధవారం చేసిన వీరంగంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. కారు, బైకు ఎదురెదురుగా వస్తున్న క్రమంలో తప్పుకునేందుకు వీలు లేకపోవడంతో మొదలైన వివాదం ఒకరిపై ఒకరు దాడి చేసుకునే వరకు వెళ్లింది. ఈ క్రమంలో వివాదం ముదురుతుండడంతో అక్కడే ఉన్న వాహన చోదకులు 100కి కాల్ చేయగా కొద్దిసేపటి తర్వాత జి.కొండూరు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే వీరంగం చేసిన ఇద్దరు వాహన చోదకులు అక్కడి నుంచి వెళ్లిపోవడంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

విద్యార్థి నేతల్ని అడ్డుకున్న గురుకుల ఉపాధ్యాయులు

తిరువూరు: ఏకొండూరు మండలంలోని కృష్ణారావు పాలెం సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు బుధవారం రాత్రి వైఎస్సార్ సీపీ నేతలు వెళ్లగా ఉపాధ్యాయులు గేట్లు మూసివేసి అడ్డుకున్నారు. గురుకులంలోని వసతి గృహంలో సరైన సదుపాయాలు లేవని, తాము ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు పలు మార్లు చేసిన ఫిర్యాదులపై వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగ రాష్ట్ర సహాయ కార్యదర్శి బీ కొండలరావు, నియోజకవర్గ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మండల కార్యదర్శి శివ, వంశీ, రాము, సురేష్, చందులు పరిశీలనకు వెళ్లగా ఉపాధ్యాయులు పోలీసుల సహాయంతో అడ్డుకుని గేట్లు మూసివేశారు. మరుగుదొడ్లు, బాత్‌రూములు అధ్వానంగా ఉన్నాయని, ఐదు వందల మంది విద్యార్థులున్న వసతిగృహానికి వార్డెను కూడా లేకపోవడంతో పర్యవేక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగ నాయకులు విలేకరులకు తెలిపారు. కూటమి ప్రభుత్వం గురుకులాలు, వసతిగృహాల సమస్యలు పట్టించుకోకుండా విద్యార్థుల్ని ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాల్లో సదుపాయాల కల్పనకు అవసరమైన నిధులు కేటాయించిందని, ప్రస్తుత ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని కొండలరావు ఆరోపించారు. సమస్యలపై పోరాడతామన్నారు.

వాలీబాల్ పోటీల్లో విద్యార్థుల సత్తా

ఆగిరిపల్లి: అంతర్ రాష్ట్ర వాలీబాల్ పోటీల్లో హీల్ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. మండలంలోని తోటపల్లి హీల్ పాఠశాల విద్యార్థులు హైదరాబాదు మల్లారెడ్డి హైస్కూల్‌లో నిర్వహించిన అంతర్ రాష్ట్ర సీబీఎస్ఈ క్లస్టర్ సెవెన్ అండర్-14 వాలీబాల్ పోటీల్లో విజేతగా నిలిచారు. హీల్ పాఠశాల సీఈఓ కూరపాటి అజయ్‌కుమార్, హెచ్ఎం లతా చౌదరి, నాగరాజు, శ్రీనివాసరావు విద్యార్థులను అభినందించారు.

స్మార్ట్ మీటర్లు బిగించొద్దు

ఇబ్రహీంపట్నం: స్మార్ట్ విద్యుత్ మీటర్లను ఇళ్లకు బిగించి చార్జీలు పెంచొద్దని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఇబ్రహీంపట్నం గాజులపేట ప్రాంతంలో బుధవారం ప్రజలకు కరపత్రాల పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి ఎం. మహేష్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఉద్యమం తీవ్ర రూపం దాల్చడంతో ఆగస్టు 5న స్మార్ట్ మీటర్లు బిగించొద్దు- కరెంట్ చార్జీలు తగ్గించాలని ఆందోళనకు పిలుపు ఇచ్చినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం రూ.15,485 కోట్ల సర్దుబాటు చార్జీలు ప్రజలపై భారం వేసిందని మండిపడ్డారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని అప్పటి ప్రతిపక్షంలో ప్రస్తుత మంత్రి నారా లోకేష్ పిలుపుచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లపై నోరు మెదపడం లేదని విమర్శించారు. ప్రజలపై భారం వేసి విద్యుత్ ఛార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. తక్షణమే అదాని స్మార్ట్ మీటర్లు ఆపాలని, లేనిపక్షంలో ప్రజా ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. గాజులపేట స్థానికులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు బానిసలు కావొద్దు



ముసునూరు: మాదక ద్రవ్యాల (డ్రగ్స్)ను నిరోధించాలన్నా, వాటికి చరమగీతం పాడాలన్నా ముందుగా బాల బాలికలు చైతన్యవంతం కావాలని, ఏఎస్సైలు ఫణిభూషణ్, బేగ్ సూచించారు. బుధవారం మండలంలోని చెక్కపల్లి జెడ్పీ హైస్కూల్లో ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు అధ్యక్షతన డ్రగ్స్ బారిన పడితే కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ సరదాగా, చిన్నగా ప్రారంభించే అలవాట్లు వ్యసనాలుగా మారి జీవితాలు నాశనమైపోతున్నాయని వాటి బారిన పడొద్దని విద్యార్థులను హెచ్చరించారు. ధూమపానం, మద్యపానం వంటి వాటి వలలో చిక్కుకోవద్దని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలకు నైతిక విలువలు నేర్పించాలని, వారిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. బాలికలు ప్రతి విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇన్‌చార్జి హెచ్ఎం శివనాగరాణి, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

మొద్దులపర్వ(జి.కొండూరు): విసన్నపేట వ్యవసాయ డివిజన్ స్థాయి విలేజ్ అగ్రికల్చర్, హార్టి కల్చర్ అసిస్టెంట్లకు ప్రకృతి వ్యవసాయంపై రెండవ రోజు శిక్షణలో భాగంగా రెడ్డిగూడెం మండల పరిధిలోని మొద్దులపర్వ గ్రామంలో బుధవారం ఫీల్డ్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజరు వై.శంకర్‌నాయక్ రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. బయో స్టిమిలెంట్స్, బీజామృతం, ద్రవ, ఘన జీవామృతం, విత్తన గుళికలు తయారు చేసే విధానంపై సిబ్బందికి అవగాహన కలిగించారు. కార్యక్రమంలో రెడ్డిగూడెం ఎంఏవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన

విస్సన్నపేట: చిన్నారులు, బాలికలు ప్రలోభాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంఈఓ సుధాకర్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తిరుపతికి చెందిన ప్రగతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మానవ అక్రమ రవాణా అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈఓ అన్నారు. పాఠశాల హెచ్ఎం శోభారాణి, నిర్వహకురాలు టి.సంధ్యారాణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్రెయినేజీ ఆక్రమణలు తొలగించాలని వినతి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): డ్రెయినేజీల ఆక్రమణలతో వర్షం నీటి పారుదలకు ఆటంకం ఏర్పడిందని, డ్రెయినేజీ ఆక్రమణలు తొలగించాలని కొండపల్లి నాగసాయి నగర్ వాసులు మున్సిపల్ కమిషనర్ రమ్యకీర్తన దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు ఆమెకు బుధవారం వినతి పత్రం అందజేశారు. డ్రెయినేజీలు ఆక్రమించిన ప్రాంతాలను ఆమెకు చూపించారు. కొండపల్లిలో ఉన్న అనేక పురావస్తు కట్టడాలు, పురావస్తు శాఖ స్థలాల నుంచి ప్రవహించే వర్షం నీరు 30వ నంబర్ జాతీయ రహదారి డ్రెయినేజీలో నుంచి వెళ్లాల్సి ఉందన్నారు. డ్రెయినేజీ ఆక్రమణకు గురికావడంతో వర్షం నీటి ప్రవాహంతో నాగసాయి నగర్ ముంపునకు గురవుతుందన్నారు. డ్రెయినేజీ ఆక్రమణలు తొలగించి కాలనీకి వర్షం నీటి ముంపు లేకుండా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసి బోడపాటి సుదీర్, స్థానికులు కోరారు.

ఈ క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలి

చాట్రాయి: రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి బి.శివశంకర్ తెలిపారు. బుధవారం మండలంలోని మర్లపాలెం గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ క్రాప్ చేయించడం వలన ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు ప్రభుత్వం నష్ట పరిహారం ఇస్తుందని, ప్రతి రైతు ఆర్ఎస్‌కేలో పంట నమోదు చేసుకోవాలని చెప్పారు. రైతులు గ్రూపులుగా ఏర్పడితే 80 శాతం రాయితీతో డ్రోన్ యంత్రాన్ని అందిస్తుందని చెప్పారు.

ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ధర్నా

తిరువూరు: ప్రభుత్వ పథకాలన్నిటికీ ఆధార్ డేటా అవసరమైనప్పటికీ తిరువూరు మండలంలో ఆధార్ కేంద్రాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు స్పందించట్లేదని సీపీఎం మండల కార్యదర్శి బీ వెంకటేశ్వరరావు ఆరోపించారు. బుధవారం తిరువూరు జన్మభూమి రోడ్డులో ఆధార్ కేంద్రం మూసివేయడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. గతంలో ప్రైవేటు ఆధార్ కేంద్రాలుండగా, వీటిని తొలగించి గత ప్రభుత్వంలో సచివాలయాల్లో నిర్వహించారని, గత ఏడాది కాలంగా సచివాలయాల్లో ఆధార్ సేవలందక ప్రజలు తెలంగాణ రాష్ట్రం వెళ్లవలసి వస్తోందని ఆరోపించారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఆధార్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేయనందున తమ పార్టీ ఆందోళనా కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. అధికారులు స్పందించాలని కోరారు.

170 మందికి కంటి వైద్య పరీక్షలు

జి.కొండూరు: మండల పరిధిలోని కట్టుబడిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు లయన్స్ క్లబ్, కొండపల్లి ఇండస్ట్రీయల్ పార్కు ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ టి.సునీత పర్యవేక్షణలో 170 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా ముప్పై మందికి కళ్లజోళ్లు అవసరమని నిర్ధారించినట్లు చెప్పారు. వీరందరికీ త్వరలో కళ్లజోళ్లను ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా సభ్యుడు బి.కృష్ణారెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా ఈ నెల 31న పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ నూజివీడు ఈఈ ఎ.సత్యానారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా ఉదయం 7.30 నుంచి 10.30 గంటల వరకు పట్టణంలోని రామాయమ్మరావుపేట, బాపూనగర్, అమ్మవారితోట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పారిశుద్ధ్య పనులు

మైలవరం: రెడ్డిగూడెం గ్రామంలో పారిశుద్ధ్య పను లు బుధవారం ముమ్మరంగా చేపట్టారు. గ్రామంలోని డ్రెయిన్లలో పూడికలు తీసి మురుగునీటి పారుదలకు వీలు కల్పించారు. రహదారుల్లో బ్లీచింగ్, సున్నం చల్లించారు. పంచాయతీ కార్యదర్శి రామారావు డ్రెయినేజీలు శుభ్రం చేయించామన్నారు.

రైతులకు సహకరించాలి

మైలవరం: రెడ్డిగూడెం పీఏసీఎస్ పాలకవర్గం రైతులకు అన్ని విధాలుగా సహకరించాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రేగళ్ళ రఘునాథరెడ్డి తెలిపారు. రెడ్డిగూడెంలో గురువారం జరిగిన రెడ్డిగూడెం పీఏసీఎస్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ బి.సుబ్బారెడ్డి, బలగాని గోపి, కాంతారావులను ఘనంగా సన్మానించారు. తమ్మినేని మాధురి, వజ్రాల కృష్ణారెడ్డి, కే యుగంధర్, ప్రకాష్, సీహెచ్ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ సమావేశం

మైలవరం: మైలవరం నియోజకవర్గం రెడ్డిగూడెం మండలంలో గురువారం సాయంత్రం 5గంటలకు 'బాబు షూరిటీ- మోసం' గ్యారెంటీ కార్యక్రమంపై విస్తృత స్థాయి సమావేశం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. రెడ్డిగూడెం గ్రామ పార్టీ అధ్యక్షుడు పైడిమర్ల శ్రీనివాసరెడ్డి ఇంటి ఆవరణలో జరిగే ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ మంత్రి జోగి రమేష్ హాజరవుతారన్నారు. చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తుకు తెస్తూ హామీలను నెరవేర్చకుండా ప్రజలు ఏరకంగా మోసపోతున్నారనే అంశాలను వివరిస్తారన్నారు. సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాల్సిందిగా కోరారు.

నేడు 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ'

తిరువూరు: 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' కార్యక్రమ నిర్వహణపై గురువారం గంపలగూడెంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కావూరి వినయ్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 3.30 గంటలకు తోటమూల విజయవాడ రోడ్డులోని కోటిరెడ్డి మామిడితోటలో జరిగే సమావేశానికి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు హాజరవుతారని పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ గడువు పెంపు

తిరువూరు: అనధికార లేఅవుట్లలోని ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం ఇచ్చిన గడువును పొడిగించినట్లు తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ మనోజ తెలిపారు. బుధవారంతో ఈ గడువు పూర్తికాగా మరో 90 రోజులపాటు అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. అక్టోబర్ 24 లోపు దరఖాస్తుకు అవకాశం ఉందని, ప్లాట్ల కొనుగోలుదారులు ఈ అవకాశం వినియోగించుకోవాలని కోరారు.